క్లుప్తంగా

వివాహ వేడుకల్లో దద్దాల



వివాహ వేడుకల్లో దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: మండలంలోని గానుగపెంటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బొబ్బూరి పోలయ్య కుమారుల వివాహ వేడుకల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం జరిగిన ప్రత్యేక పూజల్లో దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

10 మంది జూదరుల అరెస్టు

కనిగిరి రూరల్: మండలంలోని బడుగులేరు గ్రామ శివారు ప్రాంతాల్లో పేకాట శిబిరంపై ఎస్సై టి.త్యాగరాజు సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో 10 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద రూ.85,670 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆరుగురు జూదరులు అరెస్ట్

మర్రిపూడి: మండల కేంద్రమైన మర్రిపూడి శివారులోని కాలనీలో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడిచేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,640 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సీహెచ్ శివ బసవరాజు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

పాఠశాలకు సరుకుల అందజేత

కందుకూరు రూరల్: కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాలకు నాగర్వమ్మ యూత్‌సేవా సమితి ఆధ్వర్యంలో వీఆర్ కోట గ్రామ దేవస్థాన కమిటీ సభ్యులు రూ.30 వేల విలువైన బియ్యం, నిత్యావసర సరుకులు విరాళంగా అందజేశారు. దివ్యాంగ పిల్లలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. దివ్యాంగుల పాఠశాలకు రానున్న రోజుల్లో సహాయ సహకారాలు అందిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు, గ్రామస్తులు, పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో ఆక్రమణల తొలగింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

పామూరు: పామూరులో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను తొలగించి రూ.5 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని, ఈ మేరకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పామూరులో ప్రాధాన్యతా క్రమంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. అదేవిధంగా పామూరులోని రెండు హిందూ స్మశాన వాటికల్లో వసతులు కల్పిస్తామన్నారు. మోపాడు రిజర్వాయర్‌లో చెట్లను తొలగించి రిజర్వాయర్‌లోని కలుషిత నీటిని బయటకు పంపుతామని, రిజర్వాయర్ కాలువపనులు, రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు.

పొదలమాటున పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

టంగుటూరు: మండలంలోని మర్లపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్ల చెట్లు పెరిగి ప్రమాదకరంగా మారింది. పశు పోషకులు, పొలాలకు వెళ్లే రైతులు ఈ మార్గాన్నే వినియోగిస్తుంటారు. అంతేకాకుండా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉండటం వల్ల విద్యార్థులు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే వెళ్తూ ఉంటారు. గాలులు వీచిన సమయంలో ముళ్ల చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి నిప్పురవ్వలు వస్తుండటంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లారీ ప్రమాదంలో ఒకరు మృతి

కనిగిరి రూరల్: పట్టణంలోని గ్రానైట్ క్వారీల్లో జరిగిన లారీ ప్రమాదంలో డ్రైవర్ రత్తయ్య ఆదివారం రాత్రి మృతి చెందినట్లు సమాచారం. మృతుడిది బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం కుందుర్రు గ్రామంగా తెలిసింది. దీనిపై ఎస్సై టి.త్యాగరాజును వివరణ కోరగా.. ఇప్పుడే సమాచారం వచ్చిందని.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

పన్నులపై ఆసక్తి.. ప్రజారోగ్యానికి స్వస్తి..!



చింతలపాలెంలో నిచ్చెన లేక క్లోరినేషన్‌కు నోచుకోని ట్యాంక్



శంఖవరంలో ఓహెచ్‌ఆర్ ట్యాంక్ దుస్థితి ఇది



దేవాంగ నగర్‌లోని వాటర్ ట్యాంక్

- నీటి ట్యాంకుల్లో కానరానీ క్లోరినేషన్
- భయాందోళనలో పట్టణ ప్రజలు

కనిగిరి రూరల్: పట్టణాభివృద్ధికి ఆదాయ మార్గాలు అన్వేషించడంలో తప్పు లేదు.. కానీ సమాన స్థాయిలో ప్రజారోగ్యంపై కూడా అధికారులు దృష్టి సారించాలి. కేవలం పన్నుల వసూళ్లకే సచివాలయ సిబ్బందిని పరుగులు పెట్టిస్తున్న పెట్టిస్తూ ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

ట్యాంకులు శుభ్రం చేసేదెప్పుడు..?

కనిగిరిలోని 20 వార్డుల్లో 7 ఓహెచ్‌ఆర్ ట్యాంకులు, 20కి పైగా మినీ ట్యాంకులు ఉన్నాయి. ప్రధానంగా మున్సిపాలిటీలోని విలీన గ్రామాలైన శంఖవరం, చింతలపాలెం, కాశీపురం, టకారిపాలెం, కాశిరెడ్డి నగర్, దేవాంగనగర్, మాచవరం గ్రామాల్లో ఓహెచ్‌ఆర్ ట్యాంకుల ద్వారానే ఆయా గ్రామాల్లోని ప్రజలంతా నీటి వాడకం జరుగుతుంది. ఇక పట్టణంలోని 13,19, 14,15,17 వార్డుల్లో, 18 వార్డులోని కొంత భాగం పట్టణంలోని పంచాయతీ హయాం నుంచి అతి పురాతనంగా ఉన్న కొండపైన ట్యాంక్ ద్వారా వీధి కుళాయిలకు నీటిని సరఫరా చేస్తారు. వీటిలో ఏదో ఒకటి రెండు తప్ప మిగిలిన ఓహెచ్‌ఆర్, మిని ట్యాంకులను శుభ్రం చేయడం లేదు.

14 టన్నుల బ్లీచింగ్, సున్నం ఖర్చు చేశారా..?

ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో సుమారు 14 టన్నుల (దాదాపు 160 బస్తాలు) బస్తాల బ్లీచింగ్, సున్నంను మున్సిపాలిటీకి దిగుమతి జరిగినట్లు తెలిసింది. పట్టణంలోని ఇన్‌చార్జి శానటరీ ఇన్స్‌పెక్టర్‌తో పాటు 12 సచివాలయల్లో 12 మంది శానిటరీ సెక్రటరీలు, 12 మంది ఎమ్యునిటీ సెక్రటరీలు, ప్రతి సచివాలయంలో ఏఎస్‌ఎంలు ఉన్నారు. వీరికి అసలు మున్సిపాలిటీలో బ్లీచింగ్, సున్నం ఉన్న విషయాన్ని ఎవ్వరికీ చెప్పలేదు. దీంతో ఇప్పటి వరకు వార్డుల్లోని ట్యాంకుల క్లోరినేషన్ చేయించలేదు. మున్సిపల్ సమావేశాలతో పాటు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్, సున్నం స్టాక్ ఉన్న సంగతి తెలియజేయలేదు.

నీటి కాలుష్యంతో రోగాలు..

పట్టణంలో ఏదో కొన్ని వార్డులు తప్పిస్తే.. మిగిలిన వార్డులన్నింటికీ పైప్‌లైన్ ద్వారానే నీటి సరఫరా జరుగుతుంది. అయితే వార్డుల్లో ఎక్కువగా వాటర్ పైప్ లైన్లు మురికి నీటి కాలువల్లోనే దర్శనమిస్తుంటాయి. పొరపాటును లీకు పడింది అంటే మురికి నీరు పైపుల్లో కలిసి దురద, జిలతో పాటు, చర్మ వ్యాధులు, డయేరిగా వచ్చే ప్రమాదం ఉందని వైద్య అధికారులు చెప్తున్నారు. తక్షణ చర్యగా మురికినీటి కాలువల్లో ఉన్న పైపులను గుర్తించి, దిమ్మెలు ఏర్పాటు చేసి వాటిపై పైప్‌లైన్ రన్నింగ్ చేయిస్తే ఎటువంటి లీకులు పడినా.. పైపులు మరమ్మత్తులకు గురైనా నీటి కాలుష్యం అనేది జరగదు.

ఆ మూడు వార్డుల్లో పరిస్థితి దయనీయం..

పట్టణంలోని శంఖవరం, చింతలపాలెం గ్రామాల్లో 3,4,5 వార్డులున్నాయి. ఆయా వార్డుల్లో ఎక్కువ మంది ఎస్సీ, బీసీ, మైనార్టీ సామాజికక వర్గాలకు చెందిన వారు అధికంగా నివసిస్తుంటారు. ఆయా వార్డుల పరిధిలో 5 ప్రాథమిక పాఠశాలలు ఉండగా, 1 ఉన్నత పాఠశాల ఉంది. సుమారు 12వేలకు పైగా జనాభా ఉంటారు. శంఖవరంలో ఒక ఓహెచ్‌ఆర్ ట్యాంక్ ఉండగా.. చింతలపాలెంలో ఒక ఓహెచ్‌ఆర్ పెద్ద ట్యాంకులు ఉన్నాయి. నిత్యం వేల లీటర్లు నీటి సరఫరా వాటి ద్వారా ప్రజలకు జరుగుతుంది. ఆ రెండు ట్యాంకులు ఏళ్ల కాలం నుంచి కనీసం శుభ్రం చేసిన దాఖలాలు లేవు.

మున్సిపాలిటీలోని వార్డులు-20
పట్టణ విస్తీర్ణం -24.5 చ.కి.మీ
పట్టణ జనాభా- 52,500
గృహాల సంఖ్య -14,250
మున్సిపల్ వార్షిక ఆదాయం- రూ.14 కోట్లు
ఏడాదికి ఇంటి పన్నులపై వచ్చే ఆదాయం- రూ. 4 కోట్లు

కనీసం ట్యాంకులపై ఎక్కేందుకు నిచ్చెనలు కూడా విరిగి పోయి దర్శన మిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. శంఖవరం వాటర్ సరఫరాకు సంబంధించి ఎయిర్ వాల్ తొటి కూడా చెత్త చెదారంతో, మురికి నీటితో నిండి పోయి ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

వాటర్ ట్యాంక్ శుభ్రం చేసిన దాఖలాలు లేవు:



మా ఊరి ఓహెచ్‌ఆర్ ట్యాంక్ ద్వారా శంఖవరం, బీసీ కాలనీ,మైనార్టీ కాలనీలకు నీటి సరఫరా అవుతాయి. కనీసం వాటిని శుభ్రం చేసిన పాపాన పోలేదు. ట్యాంకుల్లో బ్లీచింగ్ కలిపి ఏళ్లు గడుస్తోంది. ప్రస్తుత సీజన్‌లో నీటి కలుషితంతో రోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. మున్సిపల్ అధికారులు స్పందించి, ట్యాంక్ నిచ్చెనలు మరమ్మతులు చేయించి ట్యాంక్‌లు శుభ్రం చేసే ప్రక్రియ చేపట్టాలి.

ఎస్‌కే ఖాశింపీరా, శంఖవరం

రోగాలు వస్తే మున్సిపల్ అధికారులదే బాధ్యత:



చింతపాలెం, ఎస్సీ కాలనీలకు నీటిని సరఫరా చేసే ఓహెచ్‌ఆర్ ట్యాంక్ రోడ్డు పక్కన ఉంది. ట్యాంక్ పైకి ఎక్కే నిచ్చెన కూడా ఇరిగింది. అనేక మార్లు మున్సిపల్ అధికారులకు,సచివాలయ అధికారులకు చెప్పాం. నీటి ట్యాంకులో బ్లీచింగ్ పౌడర్ చల్లి ఏళ్లు గడుస్తోంది. మున్సిపల్ అధికారులు పన్నుల వసూళ్లపై సారించిన దృష్టి ప్రజారోగ్యంపై కూడా పెట్టాలి. రోగాలు వస్తే మున్సిపల్ అధికారులదే బాధ్యత.

మూలే శ్రీనివాసులరెడ్డి, చింతల పాలెం

బస్ డ్రైవర్‌ను చితకబాదిన మందుబాబులు

గుడ్లూరు (కందుకూరు రూరల్): మద్యం మత్తులో బస్సు డ్రైవర్‌ను చితకబాధిన సంఘటన గుడ్లూరు మండలంలోని పోట్లూరు గ్రామం వద్ద ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గుడ్లూరు మండలం పాజర్ల నుంచి లారీ పొట్లూరుకు వెళ్తుంది. పొట్లూరు వెళ్లేందుకు మలుపు తిరుగుతుండగా అదే సమయంలో అడవిరాజుపాలెంకు చెందిన బ్రహ్మయ్య గుడ్లూరు నుంచి పొట్లూరుకు బైక్‌పై వెళ్తున్నాడు. లారీని దాటుకొని వెళ్తున్న జి.బ్రహ్మయ్య మలుపు వద్ద పొట్లూరుకు సమీపంలోకి వెళ్లగానే లారీకి బైక్‌ను అడ్డం పెట్టాడు. లారీ డ్రైవర్ సుధాకర్‌ను కిందకి దించి కొట్టాడు. ఈ సమయంలో జొన్నవాడ నుంచి వలేటివారిపాలెం మండల శాఖవరానికి పెళ్లి బస్సు వెళ్తూ ట్రాఫిక్ ఆగడంతో బస్సు డ్రైవర్ కిందకు దిగాడు. లారీ డ్రైవర్ సుధాకర్ తెలిసిన వ్యక్తి కావడంతో బస్సు డ్రైవర్ ఎస్‌కే బాజీ..అతన్ని ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించాడు. అప్పటికే పూటుగా మద్యం సేవించి ఉన్న బ్రహ్మయ్య మరికొందరితో కలిసి బస్సు డ్రైవర్ బాజీని చితకబాదారు. దీంతో మద్యం మత్తులో ఉన్న బ్రహ్మయ్యను డ్రైవర్లు గుడ్లూరు పోలీస్‌లకు అప్పగించారు. బాజీ ఫిర్యాదులో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. మద్యం మత్తులో ఉన్న బ్రహ్మయ్య పోలీస్‌స్టేషన్‌లోనే వీరంగం తొక్కాడు. అధికార పార్టీ మనిషిని, నన్నే స్టేషన్‌కు తీసుకొస్తారని కాసేపు హంగామా సృష్టించాడు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

హనుమంతునిపాడు: మండలంలోని చిన్నమల్లవరం పోలేరమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామదేవత పోలేరమ్మ తల్లికి చిన్నమల్లవరం గ్రామస్తులు ప్రత్యేక పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. వెలిగండ్ల మండలం గుడిపాటిపల్లి వాసుల భజన బృందంతో కులుకు భజన ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.



పోలేరమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి సురేష్



వధూవరులతో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

మర్రిపూడి: మండలంలోని రేగలగడ్డ గ్రామంలో ఆదివారం మర్రిపూడి సొసైటీ అధ్యక్షుడు బోగసముద్రం విజయభాస్కర్‌రెడ్డి, వెంకటరత్నం దంపతుల కుమార్తె శ్రావణి, నిఖిల్‌రెడ్డి వివాహానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు మాకినేని సుధారాణి వెంకట్రావు, బోద రమణారెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, మాచేపల్లి నాగయ్య, సర్పంచ్ బోగసముద్రం వెంకటరత్నం, చెన్నపనాయుడు, చెన్నారెడ్డి, సుబ్బారెడ్డి, అలికేపల్లి కోటేశ్వరరావు, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చోరీకి వచ్చి..స్థానికులకు చిక్కి..

కందుకూరు: పట్టణంలోని సాయినగర్‌లో ఆదివారం రాత్రి ఓ దొంగ దొంగతనానికి వచ్చి స్థానికులకు చిక్కాడు. సాయినగర్ 6వలైన్‌లో నివాసం ఉంటున్న భీమవరపు చెంచయ్య ఇంట్లోకి ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించాడు. ఇది గమనించిన ఇంట్లోని వారు పెద్దగా కేకలు వేయడంతో, ఇంట్లోకి వచ్చిన వ్యక్తి పారిపోయే క్రమంలో ఇంటి పక్కనే ఉన్న చిల్లచెట్ల పొదల్లోకి దూకాడు. స్థానికులు చుట్టుముట్టి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు స్థానికుల సహాయంలో చిల్లచెట్లలో ఉన్న దొంగను పట్టుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. ఇంట్లో చొరబడ్డ దొంగ ఎవరనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు

లింగసముద్రం: సర్పంచులు, కార్యదర్శులకు ఈ నెల 12, 13, 14 తేదీల్లో మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. శానిటేషన్, వీధిలైట్లు, జీపీడీపీ అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణకు మండలంలోని 16 పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

నేడు ఆలయ భూముల లీజు వేలం

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని దావగూడూరులో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయ భూములను సోమవారం ఉదయం లీజు పద్ధతిలో వేలం వేస్తున్నట్లు ఈఓ రజిని తెలిపారు. ఆలయానికి సంబంధించి 298 ఎకరాల భూములు ఉండగా గత నెల 29వ తేదీన నిర్వహించిన వేలంలో కేవలం 20 ఎకరాలకు రైతులు హక్కు పొందారు. మిగిలిన 278 ఎకరాలకు మరోమారు వేలం నిర్వహిస్తున్నాం అని ఈఓ వివరించారు. వేలం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ సీహెచ్ హజరత్తయ్య తెలిపారు.

జెడ్పీ బాలుర పాఠశాలలో వృద్ధుడు మృతి

మార్కాపురం టౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం సుమారు 80 ఏళ్ల వయసున్న వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి ఫొటోను పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ సామాజిక మాధ్యమాల్లో ఉంచడంతో మధ్యాహ్నానికి కుటుంబ సభ్యులు గుర్తించారు. పట్టణంలోని 10వ వార్డుకు చెందిన ఈశ్వర్‌రెడ్డి ఇటీవల పెన్షన్ తీసుకొని కాశీనాయన ఆశ్రమానికి వెళ్లాడని, అక్కడ నుంచి వస్తూ స్కూల్లో సేద తీరేందుకు ఆగి, అనారోగ్య సమస్యతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఎస్సై అప్పగించారు.



పార్టీ నాయకులతో సమావేశమైన బుర్రా మధుసూదన్

పార్టీ బలోపేతంపై దృష్టి సారించండి

కందుకూరు: పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై నాయకులతో చర్చించారు. గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల ఆగడాలు అలధికమయ్యాయని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టేలా వ్యవహరిస్తున్నారని బుర్రా దృష్టికి తెచ్చారు. స్పందించిన బుర్రా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ కార్యకర్తకు సమస్య వచ్చినా పార్టీ అండగా ఉంటుందని, అధికార పార్టీ నాయకులు చేసే తప్పులను న్యాయపరంగా ఎదుర్కొందామని సూచించారు. అదే సందర్భంలో గ్రామాల్లో పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ క్షేత్రస్థాయి నిర్మాణంపై దృష్టి పెట్టాలన్నారు. పార్టీ అధిష్టానం నుంచి ఆదేశాలకు అనుగుణంగా పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్దామని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

కనిగిరి రూరల్: ఉపాధ్యాయుల సమస్య పరిష్కారమే లక్ష్యంగా ఏపీటీఎఫ్ పనిచేస్తున్నట్లు సంఘ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పి.రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యదర్శి ఎస్‌కే నాయబ్ రసూల్ అధ్యక్షతన ఆదివారం జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన 117 జీఓను రద్దు చేసి, ప్రమోషన్ ఇచ్చిన తర్వాతనే సర్దుబాటు చేయాలన్నారు. ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు ఒంగోలు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్కూల్‌లో రెండు మాధ్యమాలు ఉండాలని, ప్రతి హైస్కూల్‌కు హెచ్‌ఎం పోస్టు తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లా నాయకులు ఇండ్లా ప్రసాద్, ఎస్‌కే నజీర్‌బాషా మాట్లాడుతూ 2003 డీఎస్సీ వారికి వెంటనే పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, ప్రమోషన్ క్యాడర్‌లో సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టాలని, సర్దుబాటు ప్రక్రియలో అవకతవకలు లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. ఆరు మండలాల నాయకులు హజరత్‌రెడ్డి, తోట శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్ బాబు, బీవీఎస్ ప్రసాద్, కె.రామ్మోహన్, పాకాల శ్రీను, బి.హరిబాబు, ఎన్ రమేష్ బాబు, జి.శ్రీకాంత్, దండే శ్రీను, రఫీ, హరిబాబు, కేవీ భాస్కర్‌రెడ్డి, పూర్వపు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు సాల్మన్, పి.గోపాలకృష్ణ, వి. సుబ్బారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం ముఖ్యం



మాట్లాడుతున్న చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: మానవ వికాసానికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ఎస్‌కేఆర్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేనినైనా సాధించగలరన్నారు. ఆరోగ్యం అంటే కేవలం శారీరక ఆరోగ్యం మాత్రమే కాదని, మానసిక ఆరోగ్యం అవసరమన్నారు. మానసిక సమస్యలతో బాధపడే వారి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సేవలను 14416కు నంబర్‌కు ఫోన్ చేసి ఉచితంగా పొందవచ్చని తెలిపారు. న్యాయవాది డి. బాలాజీ, గుడ్‌హెల్ప్ సంస్థ డైరెక్టర్ మంద్రు రమేష్, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా గోపూజ, మహానివేదన



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు



గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ, అభిషేకోత్సవం అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మ వేదమంత్రాలతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గోపూజ నిర్వహించారు. ముందుగా నారాయణ స్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

టంగుటూరు: పిల్లలు పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా మార్చుకోవాలని, తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథపాలకుడు వర్ధనరాజు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు పుస్తకాలు చదివేలా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపాలని కోరారు.



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు